# వ్యాపారం

-సోమవఝుల నాగేంద్రప్రసాద్

కోరుకొండ కొండ మీది నరసింహస్వామివారి ఆలయం ఎంతో పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందడమే కాకుండా కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరు పొందడంతో ఆ ఊరి ప్రజలే కాకుండా ఆ చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా అనేక మంది భక్తులు మెట్ల దారినే ఆ స్వామిని దర్శించుకుని తమ కోర్కెలు తీర్చమని స్వామివారికి విన్నవించుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా రోజురోజుకీ ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య చాలా తగ్గిపోవడంతో అక్కడ పూలు, ప్రసాదాలు అమ్ముకుని జీవించే చిన్న చిన్న వ్యాపారులకు ఒక్కొక్కసారి రోజు గడవడం కూడా కష్టమైపోతోంది.

భర్త చనిపోయిన దగ్గర నుండి పైడితల్లి ఆ స్వామివారినే నమ్ముకుని మతి స్థిమితం లేని కొడుకు అప్పన్నతోబాటే కొండమీద పూలు, పళ్లు అమ్ముకుంటూ సంసారాన్ని ఈదుకొస్తోంది. ఉదయం పదిగంటలు కావొస్తున్నా ఇంకా బోణీ కాకపోవడంతో పైడితల్లి భక్తుల రాకకోసం ఆశగా అక్కడున్న మెట్లవైపు దృష్టి సారించింది.

అప్పుడప్పుడు ఓ భక్తుడు వచ్చినా ఆమె దుకాణం దగ్గర ఆగక ముందుకు వెళ్లిపోవడంతో ఆమెకు ప్రతిసారీ నిరాశే మిగిలేది.

నిజం చెప్పాలంటే గత రెండురోజులుగా గుడికి వచ్చే భక్తుల సంఖ్య మరీ తగ్గిపోవడంతో బేరాలులేని వాళ్లు ఆ స్వామిపైనే భారంవేసి రోజులు నెట్టుకొస్తున్నారు.

ఎదురుగుండా ఓ నవదంపతుల జంట మెట్లెక్కి వస్తుండడంతో పైడితల్లిలో కొత్త ఆశ చిగురించి "రండమ్మా...రండి. స్వామివారికి ప్రసాదాలు తీసుకోండి. మీ కోరికలు తప్పకుండా తీరుతాయి" అంటూ తనదైన రీతిలో అరిచింది.

ఆ కొత్త దంపతులు చెట్టాపట్టాలేసుకుని పైడితల్లి దుకాణాన్ని సమీపించడంతో "రండి బాబు రండి... త్వరలోనే అమ్మాయిగారి కడుపు పండుతుంది" అని అంటున్న పైడితల్లివంక అదోలా చూసిన ఆ అమ్మాయి ముందుకు వెళ్లిపోవడంతో బాధపడ్డ పైడితల్లి 'ఏంటో ఈ మడుసులు..మనికిన్ని ఇచ్చిన ఆ దేవుడికి కాస్తంత పూలు, ప్రసాదాలు ఇస్తే వీళ్ల సొమ్మేంపోతుందో? రోజురోజుకీ ప్రజల్లో భక్తి తగ్గిపోతోంది' అంటూ గొణుక్కుంటూ మరోసారి మెట్లవంక ఆశగా చూసింది.

ఆ దంపతుల వెనుకే ఓ పెద్దాయన మనవడి సాయంతో మెల్లమెల్లగా చేతికర్ర ఊతంగా చేసుకుని మెట్లు ఎక్కుతూ కనిపించడంతో 'స్వామీ! ఈసారైనా మంచి బేరం తగిలేలా చూడు' అంటూ ఆ దేవుడ్ని మనసులోనే ప్రార్థించింది. పైడితల్లి

ఆ పెద్దాయన దుకాణానికి దగ్గరగా రావడంతో "రండి బాబుగారూ రండి. బాగా అలసిపోయినట్లున్నారు. వచ్చి ఇలా నీడ పట్టున కూర్చోండి" అంటూ అలసిన ముసలాయన వంక ఆశగా చూస్తూ అంది.

అప్పటికే మెట్లెక్కి బాగా అలసిపోయిన ఆయన కూడా మనవడి వంక 'ఇక నడవలేను' అన్నట్లుగా చూడడంతో వారిద్దరూ పైడితల్లి దుకాణంలో ఓ మూలగా చతికిలబడ్డారు.

"ఒరేయ్ అప్పన్నా... అయ్యగారికి మంచి నీళ్లు తీసుకురా" అంటూ కొడుకు అప్పన్నకి పురమాయించిన పైడితల్లి "ఏంటి బాబుగారూ! ఏం ఇమ్మంటారు? స్వామివారికి బంతిపూలంటే చాలా ఇష్టం. ఈ మాల ఖరీదు ఎంతో కాదు బాబూ...పాతిక రూపాయలే. ఇమ్మంటారా?" అంటూ బంతి పూల మాల చూపిస్తూ ఎంతో ఆశగా అంది.

అప్పన్న ఇచ్చిన నీళ్లు త్రాగిన ముసలాయన కొంచెం స్థిమితపడి కృతజ్ఞతగా పైడితల్లి, అప్పన్నలవంక చూసాడు.

"చూడండి బాబూ! ఈ స్వామివారు చాలా మహిమగల దేవుడు. ఇంతవరకూ ఈ స్వామిని నమ్మి చెడిపోయిన వారు లేరు" అని పెద్దాయన ముఖంలో ఏదో తెలియని బాధని గమనించిన పైడితల్లి తెలివిగా వారిలో కొత్త ఆశల్ని రేకెత్తిస్తూ అంది.

"ఔనమ్మా... ఈ స్వామివారి గురించి నేను కూడా విన్నాను. వీడు నా మనవడు. ఇదిగో వీడి తండ్రికి ఏదో తెలియని విషజ్వరం సోకడంతో వారంలోజులుగా మూసిన కన్ను తెరవలేదు" అంటూ ఆమెతో చెబుతున్న ఆయన ఏదో తెలియని బాధతో ఇంక చెప్పలేక కంట్లో వస్తున్న నీటిని ఉత్తరీయంతో తుడుచుకోవడంతో మనవడి వంక జాలిగా చూసిన పైడితల్లి-


"అయ్యో...పెద్ద కష్టమే వచ్చింది బాబు నాన్నగారికి. ఈ స్వామిని సేవించండి. తప్పకుండా మీకు మంచి జరుగుతుంది" అంది పైడితల్లి ఉదయం నుండీ బోణీకని సంగతి గుర్తుకొచ్చి వారి నమ్మకాన్ని తన వ్యాపారం కోసం ఉపయోగించాలనుకుంది.

"బాబూ! ఈ స్ఫటికమాల స్వామివారికి వేసి అబ్బాయిగారి మెళ్లో వేయండి. వెంటనే అబ్బాయిగారు ఆరోగ్యంగా తయారవుతారు. ఈ మాల ఎంతో కాదు బాబూ రెండువందలే. అలాగే స్వామివారికి లడ్డూలు అంటే చాలా ప్రీతి. ఇవి స్వామివారికి నైవేద్యం పెట్టండి. మీకు అంతా శుభమే జరుగుతుంది. ఇమ్మంటారా?'' అంటూ ఆయన వంక ఎంతో ఆశగా చూసింది పైడితల్లి.

ఆమె చెప్పిన మాటలకు ఆయనలో అణగారిపోతున్న ఆశ మరలా చిగురించడంతో "అలాగే ఇయ్యమ్మా... ఓ తండ్రిగా నేను చేయవలసింది చేస్తాను. ఆపై ఆ భగవంతుని దయ, వీడి అదృష్టం'' అంటూ మనవడి వంక చూస్తూ పైడితల్లి చెప్పినవన్నీ తీసుకుని "ఇక బయలుదేరుదామా?'' అంటూ మనవడి వైపు చూడడంతో తాతగారిని తీసుకుని స్వామి దర్శనానికి ముందుకు నడిచాడు.

వారు వెళ్లిన తరువాత ఓ మంచి బేరాన్ని చూపించినందుకు ఆ స్వామికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్న పైడితల్లి మరలా మరో బేరం కోసం మెట్లవైపు చూడసాగింది.





గుడిలో ఎక్కువగా రద్దీ లేకపోవడంతో తొందరగా స్వామి దర్శనం చేసుకున్న ఆ ముసలాయన మనవడితో కలసి పైడితల్లి దుకాణానికి తిరిగి వచ్చి ఆమెకివ్వాల్సిన డబ్బులు ఇస్తూ "అమ్మా! మావాడికి నయం అవుతుందికదా?'' అని ఎంతో బేలగా అడిగాడు.

"తప్పకుండా అబ్బాయిగారికి నయమవుతుంది బాబూ. మీరేం దిగులు పెట్టుకోకండి. ఆ స్వామి తప్పకుండా మిమ్మల్ని ఆదుకుంటాడు'' అంటూ ఎంతో నమ్మకంగా చెప్పింది పైడితల్లి.

"పోనీలేమ్మా... నీ మాటలు నిజమైతే అంతకన్నానా? మావాడికి నువ్వు చెప్పినట్లు నయమైతే ఈసారి వాడిని తీసుకునే స్వామి దర్శనానికి వస్తాను'' పైడితల్లితో అని ఆయన కొండంత ఆశతో అక్కడి నుండి తిరిగి బయలుదేరాడు.

★★★

ఆరోజు స్వామివారి దయవలన మంచి బేరం దొరకడంతో హుషారుగా ఇంటికెళ్లిన పైడితల్లికి ఉదయం ప్రసాదం కొన్న ముసలాయన ముఖమే మాటిమాటికీ గుర్తుకువస్తోంది.

పాపం ఆయన తన మాటలు నమ్మి తను చెప్పినవన్నీ కొని ఆ స్వామివారికి సమర్పించాడు. తాను తన దుకాణంలోని సరుకులు అమ్మడం కోసం ఆయనకు లేనిపోని ఆశలు కల్పించి మరీ ప్రసాదాలను కొనిపించింది.

ఒకవేళ ఆయన కొడుకు ఆరోగ్యం కుదుటపడకపోతే ఆయన ఆ స్వామి గురించి ఏమనుకుంటాడు?

అయినా చాలామంది భక్తులు ముందే తమ కోరికల లిస్టుతో స్వామి దర్శనానికి వస్తారు.

అలా స్వామివారికి పూలు, ప్రసాదాలు సమర్పిస్తే తమ కోరికలు తీరుతాయనే ఆశతోను, అంతకుమించిన నమ్మకంతోనూ ప్రసాదాలు, కానుకలు సమర్పిస్తారు. తాము కోరిన కోరికలను ఆ దేవుడు తప్పక తీరుస్తాడని వారి నమ్మకం.


అలాగే తమలాంటి వ్యాపారులు కూడా స్వామివారికి కానుకలు సమర్పిస్తే స్వామివారు సంతోషించి వారి కోరికలు తీరుస్తాడని వారిని నమ్మబలుకుతాం. ఇందులో తాము చేసిన మోసం ఏమీలేదు. జరిగితే వారి అదృష్టం.

లేకపోతే మాకు ఇంతే ప్రాప్తి అని సరిపెట్టుకుంటారు అని తనకు తాను సర్ది చెప్పుకుంది పైడితల్లి.



## ఐశ్వర్య డిమాండ్

కరీనాకపూర్‌కి ఓ సినిమాకి 7 కోట్ల వరకూ ఇవ్వడానికి నిర్మాతలు సిద్ధమవుతుంటే ఐశ్వర్యారాయ్‌కి మాత్రం ఏం తక్కువ పది కోట్లయినా ఇవ్వచ్చు అంటున్నారు. అనడమేంటి- బాబీ పుష్కర్ణా అనే ఓ నిర్మాత 10 కోట్లకి ఆమెతో ఓ సినిమా చేయడానికి రెడీ అయిపోయాట్ట కూడా. కొన్నేళ్లుగా ఐశ్వర్యతో సినిమా తీయాలని తెగ ఉబలాటపడుతున్న ఆ నిర్మాత ఎట్టకేలకు ఆమెను ఒప్పించాడుట.




ఇంటిపనిలో పడి తాత్కాలికంగా ఆ ముసలాయన విషయాన్ని మర్చిపోయింది.

అయితే రాత్రి పక్కమీదకు చేరిన పైడితల్లికి ఎంత మరచిపోదామనుకుంటున్నా మరలా ముసలాయన, ఆయన మనవడు గుర్తుకువచ్చారు.

తను వాళ్లబ్బాయికి ఆ స్వామి దయవల్ల తప్పక నయమవుతుందని చెప్పినప్పుడు ఆ పెద్దాయన కళ్లల్లో ఏదో తెలియని ఆనందం, అంతకు మించి తన మాటలమీద విశ్వాసం కనిపించాయి.

డాక్టర్లు పెదవి విరిచిన తరువాత మన చేతుల్లో ఏముంది? అయినా ఏదో నమ్మకం.

మనిషి చివరికంటూ ఆశను వదులుకోలేక ఇలా దేవుళ్లను నమ్ముకుంటారు. ఈనాడు తాను వాళ్ల భక్తితో వ్యాపారం చేసింది. ఇలా చేయడం పాపమో, పుణ్యమో తనకు తెలియదు.

తాను మాత్రం ఇదంతా కావాలని చేసిందా? ఏదో పొట్ట నింపుకోవడం కోసం చేసిందేగానీ ఒకర్ని మోసం చేయాలనే ఉద్దేశ్యంతో కాదు. ఒక విధంగా చెప్పాలంటే ఆ దేవుడే ఈ బేరాన్ని పంపించాడు. కనుక తాను చేసినదాంట్లో తప్పేంలేదు అని అనుకున్న పైడితల్లి మెల్లగా నిద్రపోవడానికి ప్రయత్నించింది.

అదేం విచిత్రమోగానీ ఆమెకు కంటిమీద కునుకు అన్నదే రాలేదు. ఆమె మనసులో ఏదో మూల తప్పు చేసాననే భావన కలగడంతో ఏదో చెప్పలేని బాధ, అంతకుమించిన భయమూ ఆమెలో కలిగాయి. అంతేకాకుండా తానే అనవసరంగా ఆ ముసలాయనకు లేనిపోని ఆశలు కలిగించానేమోనని తెగ బాధపడిపోయింది.

అవే ఆలోచనలతో ఆ రాత్రిని గడిపింది పైడితల్లి.

★★★

ఉదయాన్నే దుకాణాన్ని చూడమని అప్పన్నతో చెప్పి తాను స్వామి గుళ్లోకి వెళ్లి "స్వామీ! నా అపరాధాన్ని మన్నించి నన్ను నువ్వే కాపాడాలి. ఎవరో ఓ తెలియని భక్తునికి నీ తరపున నేను అభయమిస్తూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతని కొడుకు నిన్ను సేవిస్తే బ్రతుకుతాడని చెప్పి ఆయనలో లేనిపోని ఆశలు కల్పించాను.

డాక్టర్లే అతని కొడుకు విషయంలో పెదవి విరిచారంటే దేవుడు అతనికిచ్చిన ఆయుష్షు తీరిపోయిందనే అర్థం. భగవంతుడు అదే విషయాన్ని డాక్టర్ల ద్వారా చెప్పిస్తాడు. భగవంతుని నిర్ణయాన్ని మార్చడం ఎవరి తరం కాదు'' అంటూ బుద్ధిపూర్వకంగా తాను స్వార్థంతో చేసిన తప్పును క్షమించమని మనసారా ఆ స్వామిని వేడుకుంది.

ఎన్నడూలేనిది పైడితల్లి అలా స్వామివారి ముందు మోకరిల్లి ఏడుపు ముఖంతో ప్రార్థించడం చూసి ఆలయ పూజారి చాలా ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి పైడితల్లీ! అలా వున్నావు? దేని గురించి స్వామివారిని అంతలా వేడుకుంటున్నావు? ఏం మీ బంధువులు ఎవరికైనా ఒంట్లో బాగుండలేదా?'' అని అడిగాడు.

క్రితంరోజు జరిగిన సంగతి పూజారిగారితో చెప్పి చాలా బాధపడింది పైడితల్లి.

పైడితల్లి అమాయకత్వానికి నవ్వుకున్న పూజారి "ఊరుకో పైడితల్లీ! ఇందులో నువ్వు చేసిన తప్పేమీలేదు. స్వామిని నమ్ముకుంటే అంతా మంచే జరుగుతుందని చెప్పావు అంతేకదా. అయినా చావుపుట్టుకలు ఎవరి చేతు

ల్లోనూ లేవు. అంతా ఆ పైవాడు ఆడిస్తున్న నాటకమే'' అంటూ నవ్వుతూ పైడితల్లికి నచ్చచెప్పడంతో-

"నిజమే బాబూ...మీరన్నది కూడా యదార్థమే'' అని అక్కడినుంచి వచ్చేసిన పైడితల్లికి ఇంకా తాను తెలిసే తప్పు చేసానన్న భావన మాత్రం పూర్తిగా పోకుండా ఉంది. ఏది ఏమైనా అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడ నుకుని సర్దిచెప్పుకుని మెల్లమెల్లగా ఆ విషయాన్ని మరచిపోయి తిరిగి బేరాలు చూసుకోసాగింది.

★★★

ఎప్పటిలాగే ఆ రోజుకూడా కొందరు భక్తులు మెట్లు ఎక్కివస్తూ కనిపిం చడంతో "రండి బాబూ రండి. ఆ స్వామివారికి ఇష్టమైన ఈ పూలు, ప్రసా దాలు కొని మీ కోరికలు ఆ స్వామివారికి విన్నవించుకోండి. మీ కోరికలు ఆ స్వామి తప్పక తీరుస్తాడు'' అంటూ వస్తున్న భక్తులవైపు చూసి అరిచింది పైడితల్లి.

ఆ గుంపులో నుండి తన దుకాణం కేసి వస్తున్న ఆ ముసలాయనను చూసి గుర్తు పట్టింది.

ఆయన ముఖంలోకి సూటిగా చూడలేక సిగ్గుతో ముఖాన్ని అటువైపుగా తిప్పుకుంది.

అవేమీ గమనించని ఆ ముసలాయన సరాసరి పైడితల్లి దుకాణం ముందుకొచ్చి "ఏమ్మా! బాగున్నావా?'' అంటూ ఎంతో ఆప్యాయంగా పల కరించాడు.

"ఆ...బాగున్నాను బాబూ... ఇంతకీ అబ్బాయిగారికి ఏలా వుంది?'' పెద్దాయన ముఖంలో ఏదో తెలియని ప్రసన్నత కనిపించడంతో ధైర్యంగా అడిగింది పైడితల్లి.

"ఆ విషయం చెప్పడానికే వచ్చాను. అందరూ చెప్పినట్లు ఆ స్వామి నిజంగా దయగలవాడే. ఆ స్వామి దయవల్లనే మా అబ్బాయి ప్రాణగండం నుండి బయటపడ్డాడు. అలాగే ఆనాడు పూర్తిగా ఆశ వదులుకున్న నాకు నువ్వు స్వామికి వెయ్యమని స్ఫటికమాల, కుంకుమ, ఇంకా ప్రసాదాలు కొనిపించావు గుర్తుందా. ఆ రోజు నువ్వు ఇవ్వబట్టే ఈనాడు నా కొడుకు నాకు దక్కాడని నా నమ్మకం. అందుకు ఆ స్వామికి, నీకు ఎలా కృతజ్ఞతలు తెలియజేయాలో తెలియడంలేదు'' అంటూ ఎంతో ఆనందంగా చెప్పాడా పెద్దాయన.

"పోనీలెండి బాబూ... ఆ స్వామి దయవలన మీ అబ్బాయి మీకు దక్కాడు. మాదేముంది కడుపు నింపుకోవడంకోసం ఏవేవో చెబుతూ ఉంటాము'' అని అంది పైడితల్లి.

"అలా అనకమ్మా. ఆ రోజు నువ్వు నిండు మనసుతో స్వామివారి ప్రసా దాలు అవీ ఇచ్చి మాకెంతో ధైర్యం చెప్పావు. దానివల్ల మాకు అంతా మంచే జరిగింది. కాబట్టి మరలా అటువంటి ప్రసాదమే ఇవ్వు'' పైడితల్లితో అన్నాడా పెద్దాయన.

"అలాగే బాబుగారూ... అబ్బాయిగారు రాలేదా?'' అని ప్రసాదాలు కడుతూ అడిగింది.

"లేదమ్మా... మొన్ననే అబ్బాయిని హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకుని వెళ్లాము. ఇప్పుడు బాబు బాగా నీరసంగా ఉన్నాడు. అయినా ఈ పరిస్థితిలో ఇప్పుడిన్ని మెట్లు ఎక్కడం చాలా కష్టం. అందుచేత కొంచెం కోలుకున్న తరువాత తప్పకుండా ఆ స్వామి దర్శనం చేయిస్తాను'' అని ఆమెతో చెప్పిన ముసలాయన పైడితల్లి ఇచ్చిన ప్రసాదాలను తీసుకుని మనవడిపాటుగా స్వామివారి ఆలయంవైపు నడిచాడు.

వారు అక్కడి నుండి కదిలిందే తడవు పైడితల్లి కూడా దుకాణాన్ని చూడమని కొడుకు అప్పన్నతో చెప్పి పరుగులాంటి నడకతో స్వామి మంది రంలోకి వెళ్లి మోకాళ్లమీద కూర్చుని ఆ స్వామికి నిండు మనసుతో నమస్క రించింది.

"స్వామీ! నువ్వు చాలా గొప్పవాడివి. ఇంతకాలం నేను పడిన మానసిక క్షోభ ఈ రోజుతో తీరిపోయింది. ఆనాడు నా ప్రార్థన విని ఆ పెద్దాయన కొడుకును తిరిగి బ్రతికించి భక్తులకు నీపైవున్న నమ్మకాన్ని నిలబెట్టావు. నీ మహిమలను, శక్తిని అర్థం చేసుకోవడం ఎవరి తరమూ కాదు స్వామీ...నిన్ను నమ్ముకున్న భక్తులను ఇలాగే ఎప్పటికీ కాపాడుతూ ఉండు తండ్రీ'' అంటూ స్వామివారికి భక్తితో కృతజ్ఞతలు తెలుపుకుని కుదుటపడిన మనసుతో ఆలయంలో నుండి బయటకు వస్తున్న పైడితల్లిని చూసి మన సులోనే నవ్వుకున్నాడు ఆలయ పూజారి.

★



## నాణేలు గాయబ్

కొన్నేళ్లుగా మన దేశం నుంచి గల్లంతవుతున్న 5 రూపాయల నాణేలు బంగ్లాదేశ్‌కి అక్రమ రవాణా జరుగుతున్నదట. అక్కడ ఒక్కో నాణాన్ని తప్పడ చేసి ఆరేసి రేజరు బ్లేడ్లుగా తయారుచేస్తూ రెండు రూపాయలకి ఒక్కో బ్లేడు చొప్పున అమ్ముకుంటున్నారుట. దీన్ని అరికట్టలేని మన రిజర్వు బ్యాంకు లోహ మిశ్రమాన్ని మార్చి మరో కొత్తరకం 5 రూపాయల నాణేలను ముద్రించాలనుకుంటోందిట.

## టిక్కెట్లతో బిల్డింగ్ మోడల్

ఫ్రాన్స్‌లోని నాన్టెస్‌కి చెందిన మైఖేల్ లూకాస్ 66,048 బస్సు, మెట్రో టిక్కెట్లతో 800 క్యూబ్స్ తయారుచేసి వాటితో ఒక భవనం మోడల్ని తయారుచేసాడు.

-తటవర్తి

